క్లుప్తంగా

ఐదో రోజు రెండు నామినేషన్లు

అనపర్తి: అనపర్తి శాసనసభ స్థానానికి సంబంధించి ఐదో రోజు రెండు నామినేషన్లు దాఖలైనట్లు ఎన్నికల రిటర్నింగ్ అధికారి ఎం.మాధురి తెలిపారు. బీజేపీ పార్టీకి సంబంధించి ములగపాటి శివరామకృష్ణంరాజు తరఫున ఆయన సతీమణి దుర్గా దేవిక, అఖిల భారతీయ జన సంఘ్ తరఫున కొవ్వూరి శివానందరెడ్డిలు తమ నామినేషన్లు దాఖలు చేశారు. నామినేషన్ల పర్వం ప్రారంభమైన 18వ తేదీ నుంచి 22వ తేదీ వరకూ మొత్తం నాలుగు నామినేషన్లు దాఖలయ్యాయి.

మూడు నామినేషన్ల దాఖలు

రాజానగరం: సార్వత్రిక ఎన్నికలలో భాగంగా రాజానగరం అసెంబ్లీ నియోజకవర్గానికి సోమవారం మూడు సెట్ల నామినేషన్లు దాఖలయ్యాయని రిటర్నింగ్ అధికారి ఎ.చైత్రవర్షిణి తెలిపారు. జనసేన పార్టీ అభ్యర్థిగా బత్తుల బలరామకృష్ణ ఒక సెట్, ఆయన భార్య వెంకటలక్ష్మి మరో సెట్ నామినేషన్లు అందజేశారు. స్వతంత్ర్య అభ్యర్థిగా కట్టా కృష్ణ నామినేషన్ వేశారు.

ఘనంగా ముత్యాలమ్మతల్లి తీర్థం



ముత్యాలమ్మతల్లి

రంగంపేట: మండలంలోని ఈలకొలను గ్రామంలో కొలువైయున్న ముత్యాలమ్మ తల్లి వార్షిక తీర్థ మహోత్సవం సోమవారం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా ఆలయాన్ని విద్యుత్ దీపాలతో సుందరంగా అలంకరించారు. ఉదయం అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. అమ్మవారి స్వరూపాలైన గరగలను గ్రామంలో ఇంటింటికీ ఊరేగించారు. గ్రామస్తులు చలివిడి, వడపప్పు నైవేద్యం అమ్మవారికి సమర్పించారు. భక్తులు అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు.

ఎంపీటీసీ వెంకట రమణ మృతి



వెంకట రమణ (ఫైల్)

సీతానగరం: మండలంలోని ఉండేశ్వరపురానికి చెందిన వైఎస్సార్ సీపీ ఎంపీటీసీ సభ్యుడు మట్ట వెంకట రమణ (63) సోమవారం మధ్యాహ్నం ఒంటిగంటకు కాకినాడ జీజీహెచ్‌లో వైద్యసేవలు పొందుతూ మృతి చెందారు. ఆయన నెలరోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్నారు. రమణ మృతికి ఎమ్మెల్యే జక్కంపూడి రాజా, జక్కంపూడి విజయలక్ష్మి, జక్కంపూడి గణేష్, డాక్టర్ జక్కంపూడి రాజశ్రీ, డాక్టర్ జక్కంపూడి సుకీర్తిలు సంతాపం తెలిపారు.

కట్నం వేధింపులు

సీతానగరం: వంగలపూడికి చెందిన పాలపర్తి దుర్గ ఫిర్యాదు మేరకు ఆమె భర్త సర్వేశ్వరరావుపై కట్నం వేధింపుల కేసు నమోదు చేశామని ఎస్సై టి.రామకృష్ణ సోమవారం తెలిపారు. దుర్గకు 13 ఏళ్ల క్రితం తెలంగాణలోని అశ్వారావుపేటకు చెందిన సర్వేశ్వరరావుతో వివాహమైంది. అతడు భార్యతో పాటు వంగలపూడిలోనే నివాసం ఉంటున్నాడు. మద్యానికి బానిసైన భార్యను తీవ్రంగా కొడుతూ కట్నం కోసం వేధిస్తున్నాడు. ఈ నెల 12న మద్యం తాగివచ్చి కొట్టడంతో దుర్గ కుడి కన్నుకు తీవ్ర గాయమై చూపుకోల్పోయింది. వీరికి 12, 10 ఏళ్ల కుమార్తెలు ఉన్నారు. దుర్గ ఫిర్యాదు మేరకు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై రామకృష్ణ తెలిపారు.

ప్రభుత్వ పాఠశాలల్లో సాంకేతిక బోధన



మాట్లాడుతున్న ఎంఈఓ కుశలవదొర

మధురపూడి: ప్రభుత్వ పాఠశాలల్లో సాంకేతిక బోధన జరుగుతోందని కోరుకొండ ఎంఈఓ టి.కుశలవ దొర తెలిపారు. కోరుకొండ మండలం గాడాల -1 ప్రాథమిక పాఠశాల వార్షికోత్సవాన్ని సోమవారం ఘనంగా నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన ఎంఈవో కుశలవదొర మాట్లాడుతూ వచ్చే విద్యా సంవత్సరం నుంచి ప్రభుత్వం ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ (ఐటీ)ని బోధించడానికి ప్రణాళిక సిద్ధం చేసిందన్నారు. దీనికి సంబంధించి కోరుకొండ మండలంలోని దోసకాయలపల్లి, కణుపూరు హైస్కూళ్లు ఎంపికయ్యాయన్నారు. ఈ సందర్భంగా విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు, నృత్యాలు ఎంతో ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో ఎంఈఓ-2 ఎం.సుజాత, క్లస్టర్ హెచ్ఎం, గాడాల హైస్కూల్ హెచ్ఎం ఎస్.నిర్మలా జ్యోతికుమారి, ప్రాథమిక పాఠశాల హెచ్ఎం ఎ.సురేష్ కుమార్ పాల్గొన్నారు.

మెరిసిన విద్యా కుసుమాలు

- పదో తరగతి ఫలితాల్లో ప్రభుత్వ విద్యార్థుల ప్రతిభ
- ప్రభుత్వ విద్యా సంస్కరణలతో సత్ఫలితాలు



షేక్ సాయిగణేష్ | పి.రేష్మ | బి.వాసు | రమ్య | హారిక | ఆర్.వెన్నెల సాయి



పి.రామ సాయితులసి | డి.శృతి | కానూరి దివ్యశ్రీ | పడాల భువన తేజ | కుక్కల శ్రీతేజస్విని | గొలుగూరి సాయి జగదీశ్వరి



లోశెట్టి రేఖా రామ్‌చరణ్, 571 సంపత్ నగరం | మేడా సాత్విక్, 568 రాజానగరం | పెందుర్తి అనూష, 586 రఘుదేవపురం | కేవైఎస్‌వీడీ చరణ్, 568, చినకొం దేపూడి స్కూల్ | కె.స్వామిశంకర్, 576, కణుపూరు | ఎస్.గోపికా మహేశ్వరి, 568, కణుపూరు

అనపర్తి/పెదపూడి/రంగంపేట/బిక్కవోలు: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తీసుకొచ్చిన విద్యా సంస్కరణలతో ప్రభుత్వ పాఠశాలల్లో సత్ఫలితాలు కనిపిస్తున్నాయి. సోమవారం విడుదలైన పదో తరగతి పరీక్షా ఫలితాల్లో ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు ప్రతిభ చాటారు. కాసింత ప్రోత్సాహం తోడైతే చాలు తాము ఉన్నత శిఖరాలను అధిరోహిస్తామని నిరూపించారు. నిరుపేద కుటుంబాలకు చెందిన విద్యార్థులెందరో 600 మార్కులకు గాను 580 మార్కులకు పైబడి సాధించి శభాష్ అనిపించుకున్నారు. ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను విద్యా శాఖాధికారులు, ఉపాధ్యాయులు అభినందించారు.

- అనపర్తి మండలంలో మొత్తం 613 మంది విద్యార్థులు పదో తరగతి పరీక్షలకు హాజరుకాగా వారిలో 507 మంది విద్యార్థులు ఉత్తీర్ణులయ్యారు. 82.71 శాతం నమోదైంది. మండలంలోని రామవరం జెడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన షేక్ సాయి గణేష్ 584 మార్కులు సాధించి ప్రభుత్వ పాఠశాలల్లో మండల టాపర్‌గా నిలిచాడు. ఇదే పాఠశాలకు చెందిన కె.గణేష్‌కుమార్ 569, ఎస్‌కెఎస్ కార్తీక్ 559 మార్కులు సాధించారు. 2022 పదోతరగతి ఫలితాల్లో ఇదే పాఠశాల నుంచి షేక్ సాయి గణేష్ సోదరుడు షేక్ జీవానంద మండల టాపర్‌గా నిలవడం విశేషం. స్థానిక బాలికల ఉన్నత పాఠశాలకు చెందిన పి.రేష్మ 578 మార్కులు సాధించి మండల పరిధిలోని ప్రభుత్వ పాఠశాలల్లో ద్వితీయ స్థానంలో నిలిచింది.

– రంగంపేట మండలంలో పదో తరగతి పబ్లిక్ పరీక్షలకు 590 మంది విద్యార్థులు హాజరవ్వగా 416 మంది ఉత్తీర్ణులయ్యారు. రంగంపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థి బి.వాసు 564 మార్కులతో ప్రథమ స్థానం, జి.దొంతమూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థిని డి.రమ్య 562 మార్కులతో ద్వితీయ స్థానం, రంగంపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థిని డి.హారిక 560 మార్కులతో తతీయ స్థానం సాధించారు. మండల ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలు సాధించిన వాసు, రమ్య, హారికలను మండల విద్యాశాఖాధికారి కె.శ్రీనివాసరావు, పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, పేరెంట్స్ కమిటీ చైర్మన్లు అభినందించారు.

- పెదపూడి మండలంలో 528 మంది విద్యార్థులు పదో తరగతి పరీక్షలకు హాజరవ్వగా 481 మంది ఉత్తీర్ణత సాధించారని ఎంఈఓ-1, 2 ఎం.వెంకటేశ్వరరావు, సీవీవీ సత్యనారాయణలు తెలిపారు. సంపర గ్రామంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన ఆర్.వెన్నెల సాయి 585 మార్కులతో మండలంలో ప్రథమ స్థానం, పి.రామ సాయితులసి 582 మార్కులతో ద్వితీయ, పెద్దాడ జెడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన డి.శృతి 578 మర్కులతో తృతీయ స్థానంలో నిలిచారు. మండలంలోని 14 ప్రభుత్వ పాఠశాలలకు గాను కైకవోలు, కుమారప్రియం, సంపర, శహపురం జెడ్పీ ఉన్నత పాఠశాలలు నూరు శాతం ఉత్తీర్ణత సాధించాయి.

- బిక్కవోలు మండలంలో 608 విద్యార్థులు పదో తరగతి పరీక్షలు రాయగా వారిలో 500 మంది విద్యార్థులు ఉత్తీర్ణులయ్యారు. మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో పందలపాక ఉన్నత పాఠశాల చెందిన విద్యార్థి కానూరి దివ్యశ్రీ 589 మార్కులతో ప్రథమ స్థానం, పడాల భువన తేజ 581 మార్కులతో ద్వితీయ స్థానం, గొలుగూరి సాయి జగదీశ్వరి 571 మార్కులతో తృతీయ స్థానం సాధించారు. అదే పాఠశాలకు చెందిన బి.ఉషా అలేఖ్య 570 మార్కులు, వై.హేమంత్ 560 మార్కులు సాధించారు. కొంకుదురు ఉన్నత పాఠశాల విద్యార్థిని కుక్కల శ్రీతేజస్విని 556 మార్కులు సాధించింది.

బాలురదే పైచేయి

రాజానగరం: పదో తరగతి పబ్లిక్ పరీక్షలలో మండలంలోని విద్యార్థులు 68.31 శాతం ఉత్తీర్ణతను సాధించారు. సోమవారం విడుదలైన ఈ ఫలితాల వివరాలను ఎంఈఓలు రామన్నదొర, జ్యోతిప్రసాద్‌లు ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలోని 15 జెడ్పీ ఉన్నత పాఠశాలల నుంచి 773 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా, వారిలో 528 మంది ఉత్తీర్ణులయ్యారు. 571 మార్కులతో లోశెట్టి రేఖారామ్‌చరణ్ (సంపత్‌నగరం), 568 మార్కులతో మేడా సాత్విక్ (రాజానగరం), 554 మార్కులతో వీర లీలాకైలాష్ (సంపత్ నగరం) మొదటి మూడు స్థానాలలో నిలిచారు. ఏటా అమ్మాయిలే ముందు వరసలో నిలువగా ఈసారి మాత్రం మొదటి మూడు స్థానాలను అబ్బాయిలే సాధించారు. పాఠశాలల వారీగా చక్రద్వారబంధం 92.31, దివాన్ చెరువు 60.32, జి.యర్రంపాలెం 64.71, కలవచర్ల 75.76, లాలాచెరువు 70.83, నరేంద్రపురం 58.06, పాలచర్ల 69.44, పల్లకడియం 66.67, పాత తుంగపాడు 43.18, పుణ్యక్షేత్రం 91.80, రాజానగరం 65.69, సంపత్ నగరం 83.13, శ్రీకృష్ణపట్నం 72.73, తోకాడ 65.79, కానవరం 59.26 శాతం ఉత్తీర్ణతను సాధించాయి.

సీతానగరం మండలంలో..

సీతానగరం: మండలంలోని ప్రభుత్వ హైస్కూళ్లలో 79.5 శాతం ఉత్తీర్ణత నమోదైంది. రఘుదేవపురం హైస్కూల్‌కు విద్యార్థిని పెందుర్తి అనూష 586 మార్కులతో మండలంలో ప్రథమస్థానంలో నిలిచింది. ఆ విద్యార్థినితో పాటు తల్లిదండ్రులు పెందుర్తి పోశిబాబు, మధులతను హెచ్ఎం శ్యామలాదేవి, ఎంఈవో కె.స్వామినాయక్‌తో పాటూ పలువురు అభినందించారు. మండలంలోని 446 మంది పరీక్షలు రాయగా, వారిలో 335 మంది ఉత్తీర్ణులయ్యారు. పాఠశాలల వారీగా వంగలపూడి హైస్కూల్‌లో 35 మంది, చినకొండేపూడిలో 25, వెదుళ్లపల్లిలో 77, రఘుదేవపురంలో 68, బొబ్బిల్లంకలో 21, మిర్తిపాడులో 43, సీతానగరంలో 66 మంది విద్యార్థులు ఉత్తీర్ణులయ్యారు.

కోరుకొండ మండలంలో..

మధురపూడి: పదో తరగతి పబ్లిక్ పరీక్షలలో కోరుకొండ మండలంలోని ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు 85 శాతం ఉత్తీర్ణత సాధించినట్టు ఎంఈఓలు టి. కుశలవ దొర, ఎం.సుజాత తెలిపారు. మండలంలో 1,11 8 మంది పరీక్షలు రాయగా, 940 మంది ఉత్తీర్ణులయ్యారన్నారు. ప్రథమ శ్రేణిలో 620 మంది, ద్వితీయ శ్రేణిలో 209 మంది, తృతీయ శ్రేణిలో 119 మంది పాసయ్యారని వివరించారు. కణుపూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థి కె. స్వామి శంకర్ 576 మార్కులతో మండలంలో ప్రథమ, అదే స్కూల్‌కు చెందిన ఎస్. గోపికా మహేశ్వరి 568 మార్కులతో ద్వితీయ, కోటి హైస్కూల్‌కు చెందిన డీబీడీఎల్ సత్యవేణి 564 మార్కలతో తృతీయ స్థానాలలో నిలిచారన్నారు.

జగనన్నతోనే సంక్షేమ వెలుగులు



వడిశలేరులో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి



ఫ్యాన్ గుర్తుపై ఓటేసి గెలిపించాలని పండ్ల వ్యాపారిని అభ్యర్థిస్తున్న ఎమ్మెల్యే సూర్యనారాయణరెడ్డి

- ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి
- వడిశలేరులో ఇంటింటా ఎన్నికల ప్రచారం

రంగంపేట: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాల వల్ల నిరుపేదల జీవితాల్లో సంక్షేమ వెలుగులు నిండాయని ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి అన్నారు. మండల పరిధిలోని వడిశలేరు గ్రామంలో సోమవారం ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ముందుగా తమ గ్రామంలో ఎన్నికల ప్రచారం నిర్వహించేందుకు విచ్చేసిన ఎమ్మెల్యే డాక్టర్ సూర్యనారాయణరెడ్డికి వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పూల జల్లులతో సాదర స్వాగతం పలికారు. అనంతరం ఎమ్మెల్యే ఇంటింటికీ వెళ్లి రానున్న ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుకు ఓటేయాలని ప్రజలను అభ్యర్థించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సచివాలయ, వలంటీర్ వ్యవస్థ ద్వారా ఇంటి ముంగిటకే సేవలు అందించిన ఘనత సీఎం జగన్‌కే దక్కుతుందన్నారు. ప్రస్తుతం అమలవుతున్న సంక్షేమ పథకాలు కొనసాగాలంటే జగనన్నను మళ్లీ ముఖ్యమంత్రిగా గెలిపించుకోవాలన్నారు. అబద్ధపు హామీలతో ప్రజలను మోసం చేయాలని చూస్తున్న చంద్రబాబుకు ప్రజలంతా మరోసారి బుద్ధి చెప్పాలని కోరారు. రాబోయే ఎన్నికల్లో అనపర్తి అసెంబ్లీ అభ్యర్థిగా తనను, పార్లమెంటు అభ్యర్థిగా డాక్టర్ గూడూరి శ్రీనివాస్‌ను ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి గెలిపించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు పేపకాయల రాంబాబు, జెడ్పీకో-ఆప్షన్ సభ్యుడు లంక చంద్రన్న, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ నల్లా శ్రీనివాసరావు, వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి కొల్లాటి ఇజ్రాయిల్, రాష్ట్ర రైతు, చేనేత విభాగాల కార్యదర్శులు రిమ్మలపూడి వెంకటేశ్వరరావు, పాలాటి నాగేశ్వరరావు, అనపర్తి మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ అడబాల వెంకటేశ్వరరావు, సొసైటీ చైర్మన్ పోతుల బులివీర్రాజు, పార్టీ కన్వీనర్ నలమాటి భీముడు తదితరులు పాల్గొన్నారు.

మహిళా సాధికారత జగనన్నతోనే సాధ్యం

ఎమ్మెల్యే సతీమణి సత్తి ఆదిలక్ష్మి



లక్ష్మీనరసాపురంలో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న ఎమ్మెల్యే సతీమణి సత్తి ఆదిలక్ష్మి

అనపర్తి: మహిళా సాధికారత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితోనే సాధ్యమైందని ఎమ్మెల్యే సతీమణి, వైఎస్సార్ సీపీ నాయకురాలు సత్తి ఆదిలక్ష్మి అన్నారు. సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో వైఎస్సార్ సీపీ అభ్యర్థులకు మద్దతుగా ఆదిలక్ష్మి ఎన్నికల ప్రచారాన్ని ముమ్మరంగా నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా సోమవారం ఆమె మండలంలోని లక్ష్మీనరసాపురంలో ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో ఇంటింటికీ వెళ్లి గత ఐదేళ్లలో వైఎస్సార్ సీపీ ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ పథకాలతో ఆయా కుటుంబాలకు కలిగిన ప్రయోజనాన్ని వివరించారు. అన్ని వర్గాల ప్రజలు మరింత అభివృద్ధి సాధించాలంటే వైఎస్సార్ సీపీని మళ్లీ ఆదరించి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని తిరిగి ముఖ్యమంత్రిని చేసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. వచ్చే నెల 13న జరగనున్న సార్వత్రిక ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి రాజమహేంద్రవరం ఎంపీగా డాక్టర్ గూడూరి శ్రీనివాస్‌ను, అనపర్తి ఎమ్మెల్యేగా డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డిలను భారీ మెజార్టీతో గెలిపించాలని ఆమె ప్రజలకు విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యురాలు సత్తి గీతావరలక్ష్మి, వైస్ ఎంపీపీ పులగం బుల్లిరెడ్డి, ఎంపీటీసీ సురకాసుల శివ, కుతుకులూరు సర్పంచ్ గొల్లు హేమతులసి, సత్తి దొరయ్యరెడ్డి, రాజు గురుస్వామి, శివశంకర్‌రెడ్డి, పులి తదితరులు పాల్గొన్నారు.

దేశానికే ఆదర్శంగా సీఎం జగన్



రఘుదేవపురంలో ఎన్నికల ప్రచారం చేస్తున్న డాక్టర్ సుకీర్తి

- డాక్టర్ జక్కంపూడి సుకీర్తి
- రఘుదేవపురంలో ప్రచారం

సీతానగరం: అనేక సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టి, పేదల జీవితాల్లో వెలుగులు నింపిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దేశానికే ఆదర్శంగా నిలిచారని ఉభయ గోదావరి జిల్లాల యువజన విభాగం రీజనల్ కో ఆర్డినేటర్ జక్కంపూడి గణేష్ సతీమణి డాక్టర్ సుకీర్తి అన్నారు. ఆమె సోమవారం రఘుదేవపురం లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ప్రతి ఇంటికి వెళ్లి మహిళలకు బొట్టు పెట్టి, ఫ్యాన్ గుర్తుపై ఓటు వేయాలని కోరారు. ఆమె మాట్లాడుతూ నవరత్నాల పథకాలతో అనేక మంది ఆర్థిక అభ్యున్నతి సాధించారన్నారు. మరోసారి ప్రజలను మోసం చేసేందుకు చంద్రబాబు, అతడి బృందం మాయమాటలు చెబుతున్నారని, వాటిని నమ్మితే మోసపోవడం ఖాయమన్నారు. వచ్చే ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి, ఎంపీగా డాక్టర్ గూడూరి శ్రీనివాస్, ఎమ్మెల్యేగా జక్కంపూడి రాజాలను గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో సర్పంచ్ ఇందుగుమిల్లి చంద్రలీల, పార్టీ నాయకులు గెద్దాడ త్రిమూర్తులు, పంతుల శ్రీను, పిండి రాధాకృష్ణ, పాలచర్ల అచ్యుత రామారావు, పరిమి కర్ణలరాజు, పైడి రాజు, గెద్దం రాజు, సుంకర సూర్యచంద్రం, కాండ్రు వెంకట్రాజు, యనమదల చినఅబ్బులు, యనమదల వెంకన్నబాబు, పిసిని రాజేష్, పంతుల పోశారావు పాల్గొన్నారు.

జగనన్నతోనే సంక్షేమం



వంగలపూడిలో ఎన్నికల ప్రచారం చేస్తున్న డాక్టర్ రాజశ్రీ

సీతానగరం: ఐదేళ్లుగా ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేసిన సంక్షేమ పథకాలే ప్రస్తుత ఎన్నికల్లో ఆయను మరోసారి గెలిపిస్తాయని ఎమ్మెల్యే జక్కంపూడి రాజా సతీమణి డాక్టర్ జక్కంపూడి రాజశ్రీ అన్నారు. సోమవారం వంగలపూడిలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. రానున్న సార్వత్రిక ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుపై ఓట్లు వేసి, వైఎస్సార్ సీపీ అభ్యర్థులను గెలిపించాలని కోరారు. రాజానగరం నియోజకవర్గంలో ఎమ్మెల్యే జక్కంపూడి రాజా రూ.1,773 కోట్లతో అభివృద్ధి కార్యక్రమాలు, మరో రూ.1,377 కోట్లతో సంక్షేమం అందించామన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ కొంచ అన్నపూర్ణ, ఎంపీటీసీ సూరెడ్డి గంగాభవాని, పార్టీ నాయకులు రంధి భారతిదేవి, రంధి శంకరం, రంధి సుధాకర్ పాల్గొన్నారు.

త్రైత సిద్ధాంత భగవద్గీత ప్రచారం

రాజానగరం: త్రైత సిద్ధాంతం ప్రబోధ సేవా సమితి ఇందూ జ్ఞాన వేదిక రాజమహేంద్రవరం కమిటీ ఆధ్వర్యంలో సోమవారం మండలంలోని కానవరంలో త్రైత సిద్ధాంత భగవద్గీతను ప్రచారం నిర్వహించారు. ఆచార్య ప్రబోధానంద యోగీశ్వరులు రచించిన ఆధ్యాత్మిక త్రైత సిద్ధాంత గ్రంథాల గురించి అవగాహన కల్పించారు. కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

జగన్ పాలనలో నిజమైన అభివృద్ధి



ఎన్నికల ప్రచారం చేస్తున్న ఎమ్మెల్యే జక్కంపూడి రాజా

- ఎమ్మెల్యే జక్కంపూడి రాజా
- విస్తృతంగా ఎన్నికల ప్రచారం

రాజానగరం: ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో రాష్ట్రంలో నిజమైన అభివృద్ధి జరిగిందని, ఎన్నికల సమయంలో ఇచ్చిన ప్రతి హామీని ఆయన నెరవేర్చారని స్థానిక ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు జక్కంపూడి రాజా అన్నారు. మండలంలోని నందరాడ, నరేంద్రపురాల్లో ఆయన సోమవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. గడచిన ఐదేళ్లలో ప్రతి గ్రామంలోనూ కోట్ల రూపాయలతో అనేక అభివృద్ధి పనులు జరిగాయన్నారు. గతంలో పనిచేసిన ఎమ్మెల్యేల మాదిరిగా కాకుండా గెలిచిన నాటి నుంచి నిరంతరం ప్రజా సంక్షేమం కోసం, నియోజకవర్గ ప్రగతి కోసం పనిచేశానన్నారు. రబీ పంటకు కూడా పుష్కలంగా సాగునీరు అందించగలుగుతున్నామన్నారు. రాబోయే రోజులలో ఇంటింటికీ గోదావరి జలాలను సరఫరా చేసేలా రూ.217 కోట్లతో వాటర్ గ్రిడ్ పథకాన్ని అమలుచేసేలా చర్యలు తీసుకున్నామన్నారు. దొంగలు, దోపిడీదారులు, హంతకులు, మహిళలను విదేశాలకు అమ్మేసిన వారు అక్రమ సంపాదనకు అలవాటు పడిన వారు ఈ ఎన్నికలలో పోటీ చేస్తున్నారని, వారు చెప్పే మాయ మాటలు నమ్మి మోసపోవద్దన్నారు. గాదరాడలో తాను అభివృద్ధి పనులు చేపడితే వాటిని అడ్డుకున్న వ్యక్తి, నేడు శ్రీరంగనీతులు వల్లించడం విడ్డూరంగా ఉందన్నారు. రాబోయే ఎన్నికలలో ప్రజా సంక్షేమం, అభివృద్ధికి మద్దతు ఇస్తూ ఫ్యాను గుర్తుకు ఓట్లు వేయాలని జక్కంపూడి రాజా కోరారు. ఆయా గ్రామాలకు చెందిన వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పోయిన గంటలోనే హ్యాండ్ బ్యాగ్ రికవరీ



ఏఎన్ఎంకు బ్యాగ్ అందజేస్తున్న ఏఎస్సై సమర్పణరావు

సీతానగరం: కూనవరం సచివాలయ ఏఎన్ఎం యూకే శారద ఇచ్చిన ఫిర్యాదుపై తక్షణమే స్పందించిన ఎస్సై టి రామకృష్ణ గంటలో రూ.45 వేల విలువైన వస్తువులున్న బ్యాగును రికవరీ చేసి అందించారు. విధులలో భాగంగా శారద సోమవారం సీతానగరం పీహెచ్‌సీకి వచ్చి తిరిగి తన బైక్‌పై కూనవరం వెళుతుండగా ఆమె హ్యాండ్‌బ్యాగ్ పడిపోయింది. దీంతో సీతానగరం పోలీస్ స్టేషన్‌లో సాయంత్రం 6 గంటలకు ఫిర్యాదు చేశారు. తక్షణమే స్పందించిన ఎస్సై సాంకేతిక పరిజ్ఞానం ఉపయోగించి, సిబ్బంది సాయంతో సాయంత్రం 7 గంటలకు హ్యాండ్ బ్యాగ్‌ను స్వాధీనం చేసుకున్నారు. అందులో రూ.30 వేల విలువైన గవర్నమెంట్ సామ్సంగ్ ట్యాబ్, రూ.15 వేల విలువైన సెల్‌ఫోన్, విలువైన డాక్యుమెంట్లు ఉన్నాయి. పోయిన తన వస్తువులను తిరిగి అప్పగించినందులకు ఎస్సై రామకృష్ణతో పాటుగా సిబ్బందికి ఏఎన్ఎం శారద కృతజ్ఞతలు తెలిపారు

రమణ మాస్టార్ సేవలు అభినందనీయం

మధురపూడి: విద్యాభివృద్ధికి సోషల్ మాస్టార్ గాలి పెద వెంకట రమణ చేసిన సేవలు అభినందనీయమని గాడాల హైస్కూల్ హెచ్ఎం ఎస్. నిర్మలా జ్యోతికుమారి అన్నారు. రమణ మాస్టార్ ఉద్యోగ విరమణ సభను సోమవారం హైస్కూల్లో ఘనంగా నిర్వహించారు. హెచ్ఎం మాట్లాడుతూ బుధవారం నుంచి వేసవి సెలవులు కావడంతో ఈ నెల 30వ తేదీన నిర్వహించాల్సిన ఈ సభను సోమవారం జరిపామన్నారు. అనంతరం ఆయనను ఘనంగా సత్కరించారు.

పోస్టల్ బ్యాలెట్‌కు ప్రత్యేక ఏర్పాట్లు

రాజమహేంద్రవరం రూరల్: రానున్న ఎన్నికల్లో పోస్టల్ బ్యాలెట్ ప్రక్రియ కోసం ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నామని రూరల్ నియోజక వర్గ రిటర్నింగ్ అధికారి, జాయింట్ కలెక్టర్ ఎస్.తేజ్ భరత్ తెలిపారు. స్థానిక ఫ్యూచర్ కిడ్స్ స్కూల్లోని పోస్టల్ బ్యాలెట్ ఫెసిలిటేషన్ కేంద్రం ఏర్పాటు పనులను సోమవారం రాత్రి ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పోస్టల్ బ్యాలెట్ కలిగిన ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా ఫెసిలిటేషన్ కేంద్రానికి వచ్చి ఓటుహక్కును వినియోగించుకోవాలన్నారు. ఆయన వెంట స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ ఐ.సాయిబాబా, సహాయ రిటర్నింగ్ అధికారులు వైవీకే అప్పారావు, బి.రమాదేవి ఉన్నారు.